జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 02, మార్చి 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

**మగువకు చీరకట్టు, మగాడికి పంచెకట్టు, ఊరికి మాటకట్టు, ఇదే మన పూర్వీకుల సంస్కృతి గుట్టు...! ప్రపంచం పోకడ ఎంతో వేగంగా మారుతున్నా మన భారతీయ సంప్రదాయ విలువలు చాలావరకు ఇంకా మారకుండా అలాగే సజీవంగా వున్నాయి. భారతీయ సంస్కృతికి ప్రత్యేకత చీర. చీర నేను శ్వాస తీసుకునేటప్పుడు గాలిలోకి రెపరెపలాడుతూ ఎగురుతుంది, కన్నీరు వచ్చినప్పుడు కొంగుతో తుడుస్తుంది, అర చేతిలో, అగ్గిపెట్టెలో కూడా ఒద్దికగా ఇమిడి పోతుంది" - అని చాలా మంది వర్ణించారు. ఒంటి చుట్టూ ఏకవస్త్రం కప్పుకునే రోజుల నుంచి ఆధునిక తీరులో చీర కట్టేవరకూ చీర కట్టు మారుతూ వచ్చింది.**

సింగారం

# చీరకట్టు చూడతరమా?

భారతదేశంలోనే వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు ప్రాంతాల్లో ఆయా సంస్కృతులకనుగుణంగా చీర కట్టు రూపాంతరం చెందింది. కవులు, రచయతలు తమ పాటలు, కవితల్లో రక రకాల చీరబీలను, దేశంలో ఉన్న నేత తీరులను వర్ణించారు. చీర చుట్టూ తిరిగిన తెలుగు సినిమా పాటలు కూడా ఉన్నాయి మైథిలి సంస్కృతిలో ఈ ఆరు గజాల చీర ఒకప్పుడు ఏకవస్త్రంగా ఉండేదని, "చీర ఒక ఉనికిని సూచిస్తుంది. చీర కట్టే తీరు ప్రాంతీయతకు సంకేతంగా నిలుస్తుంది. చాలా చోట్ల ఒక్కొక్క వర్గానికి ఒక్కొక్క రకమైన చీర కట్టులు ఉన్నాయి. తమిళనాడులో మడిసార, ఐయ్యర్ తరహా మాదిరిగా రకరకాల చీర కట్టే తీరులున్నాయి. ఆయా ప్రాంతాల్లో మహిళలు చేసే పని, వాతావరణం, సౌకర్యానికనుగుణంగా చీర కట్టే తీరు మారింది.

"రాచరిక కుటుంబాలకు చెందిన రాణి గాయత్రీ దేవి, ఉదయ్ పూర్, జోధ్ పూర్ మహారాణుల లాంటి వారు కూడా తాము ధరించిన చీరల ద్వారా ఒక ప్రత్యేక ప్రక్రియకు, షిఫాన్, చందేరీ చీరలకు శ్రీకారం చుట్టి ఒక ట్రెండ్ సృష్టించారు"ఇన్ని రూపాంతరాలు చెందిన ఆరు గజాల చీర నేడు మల్టీ నేషనల్ కంపెనీ బోర్డు రూముల్లోకి, లా చాంబర్స్‌లోకి, వ్యాపార వర్గాల్లోకి, సాధికారత సాధించిన వృత్తుల్లోకి వచ్చి తన ఉనికిని చాటుకుంటోంది నిండైన ఆడతనానికి వన్నె తెచ్చేది చీర. పదహారణాల ఆడపిల్ల పరువానికి పరువే చీర. ఎన్ని రకాల దుస్తులు వచ్చినా, వస్త్రాలంకారాన్ని ఎన్ని ఫ్యాషన్ పోకడలు చుట్టుముట్టినా పదహారణాల తెలుగింటి ఆడపడుచు మార్కు మాత్రం చీరదే. చీరలు తరతరాల భారతీయ వస్త్ర ధారణలో భాగం. ఇంటికొచ్చిన ఆడపడుచుకి మనసారా చీర పెట్టినప్పుడు కలిగే తృప్తిని దేనితో కొలవగలం? ఆడపిల్ల రూపానికి చీరని మించి మరే వస్త్రం లాలిత్యాన్ని ఆపాదించగలదు?

ఆడవాళ్ళకి చీర తెచ్చే హుందాతనాన్ని మరింకేది తీసుకురాగలదు? చీరలో అంతటి సొగసు, నిండుదనం వున్నాయి కాబట్టే ఇప్పటికీ తెలుగింటిలో చీరకు అంతటి ఉన్నత స్థానం. సాహిత్యంలో కూడా భారతీయ దుస్తులలో ప్రామాణికమైన చీరల గురించి విశేషంగా ప్రస్తావన జరిగింది.





తెలుగు సినిమా పాటల్లో కూడా చీరకు విశిష్ట స్థానం కలిపించారు మన కవులు.. భారతీయ సంస్కృతిని సగర్వంగా చాటి, మన జాతీయ జెండాకు సమానంగా నిలిచిన చీర గురించి, రాయబడిన పాటల గురించి మీకు గుర్తు చేద్దాం. చీరల్లో రకరకాల చీరలు వున్నా, తెలుగింటిలో పట్టుచీరదే మొదటి స్థానం. పెళ్ళిళ్ళలో, వేడుకల్లో ఆడవాళ్ళు పట్టుచీరల్లో కళకళలాడుతూ కలయ తిరుగుతుంటే కన్నుల పండుగలా వుంటుంది. అందుకే అన్నారేమో "నువ్వు పట్టు చీర కడితే ఓ పుత్తడి బొమ్మా, ఆ కట్టుబడికి తరించేను పట్టుపురుగు జన్మ" అని. కాదనగలరా? చీరనే కాదు, మన తెలుగు కవులు చీర కట్టుని కూడా అందంగా వర్ణించారు.

మీరే చూడండి "మడి కట్టుతో నువ్వు పూజ చేస్తే గుడి వదిలి దిగివచ్చును దేవుడు, ఎంకి కట్టుతో నువ్వు పొలం పనులు చేస్తే సిరిలక్ష్మిని కురిపించును పంటలు., జారు కట్టుతో పడకటింట చేరితే గుండె జారి చూస్తాడు పురుషుడూ, నిండు కట్టుతో నువ్వు నడిచి వెళ్తుంటే దండాలే పెడతారు అందరూ." ఆ ఊహ ఎంత బాగుందో కదూ? పాట వింటుంటే ఆ చీర కట్లతో స్త్రీలు కళ్ళముందు కదలాడతారు. పసిపాపలా నిదురపోయినప్పుడు ఊయలగా మారి, అన్నం తిన్న తదుపరి మన మూతిని తుడిచి, కన్నీరై వున్నప్పుడు మన చెంపని తడిమి – ఆ చీర కొంగులోనే కన్నతల్లి ప్రేమని వెన్నెలే ఓ కన్నెపిల్లైతే ఆమెను కప్పేసే పల్చటి మేఘాలే మబ్బు చీరలు. సప్త వర్ణాలే ఏడు చీరలయితే ప్రతీ పడుచు ఓ హరివిల్లు.

అందుకే అన్నాడేమో మరో కవి "వన్నె వన్నె చీరల్లోనా నీ ఒళ్ళే హరివిల్లు" అని. "చుట్టూ చెంగావి చీర చుట్టాలే చిలకమ్మాబొట్టూ కాటుక పెట్టి, నే కట్టే పాటని చుట్టి, ఆశపడే కళ్ళల్లోనా ఊసులాడు వెన్నెల బొమ్మా"ఎర్ర రంగు చీరలో సందెపొద్దులా , పచ్చరంగు చీరలో పంట చేను సిరిలా ఆ పడుచు కనిపించిందేమో! నేరేడు పళ్ళరంగులో జీరాడే కుచ్చిళ్ళతో, వంగపండు రంగులో పొంగుతున్న సొగసులతో కవి హృదయాన్ని తాకి వుంటుంది ఆ పడతి. అందుకే ఆ పాట ఇప్పటికీ మనసును అనుభూతులతో నింపుతుంది. " సరికొత్త చీర ఊహించినాను, సరదాల సరిగంచు నేయించినాను., మనసూ మమతా పడుగూ పేటా చీరలో చిత్రించినాను.

ఇది ఎన్నో కలల కలనేత, నా వన్నెల రాశికీ సిరిజోతా" ముచ్చట గొలిపే మొగలిపొత్తులను, అభిమానం గల ఆడపిల్ల అలకా కులుకులనూ కలబోసి చీరగా మలిచి కొంగుకు చెంగున ముడివేసాడు ఆ కవి. పెళ్లి పుస్తకం లోని ఈ మధురమైన పాటను ప్రస్తుతించకుండా చీరను గురించి చెప్పడంచాలా కష్టం. సింగారమనే దారంతో చేసి, ఆనందమనే రంగులను అద్ది, మమకారమనే మగ్గం పై నేసిన చీరకు తిరుగేముంది? చీర పవిత్రతని సూచిస్తుంది, మన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది, దెబ్బ తగిలి రక్తం కారితే సర్రన చిరిగేది- అమ్మమ్మ కట్టే ముతక చీర. ఏడ్చే కళ్ళని తుడిచి ఒదార్పుని అందించేది – ఆత్మీయత నిండిన అమ్మ చీర . సోదరి మీది ప్రేమాభిమానాల్ని, వెలకట్టలేని అనురాగాన్ని అపురూపంగా మూట కట్టి ఇచ్చేది – ఆడపడుచుకు పెట్టే పట్టుచీర. చీర లోనే వుంది పవిత్రత చీరతోనే భారతీయ మగువకి పరిపూర్ణత.

### వామ్మో చీరకట్టులో ఇన్నిరకాలా?

**తెలుగు రాష్ట్రాల్లో నివి చీర కట్టు:** తెలుగింటి మహిళల చీరకట్టును నివి అంటారు. ఏ హంగు, ఆర్భాటం లేకుండా సాదాసీదా కట్టుతో హుం దాగా కనిపిం చడం ఈ చీరకట్టు ప్రత్యేకత.

**తమిళనాడు, మడికట్టు :** పూజచేసే సమయంలో మడి పద్ధతిలో చీర కట్టుకోవడం వినే ఉంటారు. క్రీ. పూ 2వ శతాబ్దం నుంచీ తమిళనాట ఈ పద్ధతి కొనసాగుతోంది. దీనికి తొమ్మి దిగజాల చీరను ఉపయోగిస్తారు.

**కర్ణాటక, కూర్గ్:** ఇక్కడ ఎక్కువగా కాంజీవరం చీరలను కూర్గ్ స్టైల్‌లో కట్టుకుంటారు. కొడవచీరకట్టు అన్నా కూడా ఇదే.

**మహారాష్ట్ర, నవ్వారి:** ఈ స్టైల్‌లో చీర కట్టుకోవాలంటే దాదాపు తొమ్మిది గజాలు ఉండాలట. దీన్నే కాస్తా చీర అని కూడా అంటారు.

**కేరళ, ముండుమ్ నెరియతుమ్:** ఇక్కడి వారు తెలుపు రంగు, బంగారు వర్ణం అంచు ఉన్న చీరలనే ఎక్కు వగా కట్టుకుంటారు. ముండుమ్ నెరియతుమ్ అంటే రెండు ముక్కల వస్త్రం అని అర్థం. ఈ ముక్కల చీరను కసవు అని కూడా పిలుస్తారు.

### గుజరాత్, సీదా పల్లుచీర

ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్ ప్రాం తాల్లో ఈ చీరకట్టు ఎక్కువగా కనిపిస్తుం ది. దేశవ్యాప్తంగా ఈ స్టైల్ ప్రసిద్ధి చెందింది. బెం గాల్, అట్పూర్ ఈ చీరకట్టు పశ్చిమ బెంగాల్‌ది. అస్సాం లో చేతితో నేసిన ఎరుపు రంగు అంచుతో ఉన్న తెలుపు చీరల్నే అధికం గా ధరిస్తారు. దీన్నే మేఖేలా స్టైల్ అనీ అంటారు. పండగల వేళ ఎక్కు వగా ధరిస్తుం టారు. కుంబి గోవాలోని ఓ పురాతన తెగ పేరునే ఈ చీర స్టైల్‌కు పెట్టారు. ఈ శారీలను ఎక్కు వగా ఎరుపు రంగు షేడ్‌లోనే తయారు చేస్తారు. ప్రస్తుతం వీటిని నేసే వారు, ధరించే వారి సంఖ్య చాలా వరకూ తగ్గింది.

# ఆంధ్ర అబ్బాయి... అగర్తల అమ్మాయి

### ఆశీర్వదించిన త్రిపుర గవర్నర్

ఆంధ్ర అబ్బాయి.. అగర్తల అమ్మాయి ఒక్కటయ్యారు.. పెద్దలను ఒప్పించి సాంప్రదాయబద్ధంగా మూడుముళ్ల బంధంతో వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు.. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరుకు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ కందిమళ్ళ వెంకట్రావు, జయ శ్రీ దంపతుల కుమారుడు రామ్ కు NIT అగర్తలలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాడు.. అదే సమయంలో తన సహచర విద్యార్థిని , అగర్తలకు చెందిన దాలియాతో ప్రేమలో పడ్డాడు.

ఇంజనీరింగ్ విద్య పూర్తయిన పై చదువుల కోసం ఇద్దరూ కలిసి అమెరికాకు వెళ్లారు.. ఉన్నత చదువులు పూర్తయిన తర్వాతనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని అదే విషయాన్ని ఇరువైపులా పెద్దలకు తెలియజేశారు. ఇరుపక్షాల పెద్దలు అందుకు అంగీకరించారు.

చదువు పూర్తి చేసుకున్న వారిరువురూ ఇటీవల ఇండియాకు తిరిగి వచ్చారు. ఈనెల 24న గుంటూరులో



ఇరువైపులా పెద్దల సమక్షంలో తెలుగు సాంప్రదాయబద్ధంగా వివాహ క్రతువును పూర్తి చేసుకున్నారు.

అయితే త్రిపుర రాజధాని అగర్తలలో దాలియా స్వస్థలంలో వారి సాంప్రదాయ ప్రకారం వివాహ వేడుక నిర్వహించారు. రామ్ తండ్రి కందిమళ్ళ వెంకట్రావు సీనియర్ జర్నలిస్టు కావటంవల్ల, ప్రస్తుతం త్రిపుర రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేస్తున్న నల్లు ఇంద్రసేనారెడ్డితో గతంలోనే ఆయనకు పరిచయం ఉంది.

త్రిపురలో జరుగుతున్న తన కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించడంతో, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అగర్తల పట్టణంలోని ఫ్లవర్స్ క్లబ్ మ్యారేజ్ ఫంక్షన్ హాల్లో జరిగిన రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. నూతన వధూ వరులు రామ్, దాలియాలను ఆశీర్వదించారు





## శ్రీశైలానికి రాత్రిళ్లూ రాకపోకలు

శ్రీశైలంలో ఈరోజు నుంచి 11వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వీటిని వీక్షించేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నల్లమలలో రాత్రి వేళ వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నట్లు అటవీ క్షేత్రాధికారి తెలిపారు. పెద్దదోర్నాల- శ్రీశైలం నల్లమల రహదారి పులుల అభయారణ్యం పరిధిలో ఉంది. దీంతో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఇటుగా వాహనాల రాకపోకలను అనుమతించరు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు.

## దోమల నివారణకు..


వేప ఆకు పొడి. ఆవాలు దోరగ వేయించి పొడి చేయాలి, కర్పూరం, కల్లుప్పు పొడి, మట్టి పాత్ర, పిడకలు (ఆవు లేక గేద), పిడకలు మట్టి పాత్రలో వేసి, దాని మీద, కర్పూరం వెలిగించి దానిలో మంట వచ్చాక కసేపు బయట పెట్టాలి, కాసేపు ఉంచి దానిని ఇంట్లో పెట్టి, అన్ని తలుపులు వేసేసి, ఆ మంట మీద పైన చేసిన పొడులు వేయాలి



అపుడు పొగ వస్తుంది, ఆ పొగను 15 లేక 20 నిమిషాల పాటు, ఇంట్లో అన్ని గదులలో వేయాలిపైన చెప్పిన వాటితో పాటు ఇప్పుడు చెప్పె వాటిని కూడ వాడవచ్చు ఉత్తరేణి ఆకుల పొడి కానుగ లేక గానుగ పొడి సీతాఫలం ఆకు పొడి పొగాకు పొడి .ఈ పొగ వేయడం వల్ల, మనకు చాల ఉపయోగము, కఫము వున్న, ఊపిరిత్తిత్తులలో సమస్యలు నివారిస్తుంది.

## బట్టతల నివారణకు..

బట్టతల నివారణకువేప నూనె, ఆవ నూనె తల నుండి పాదాల వరకు వ్రాసుకోవాలి తలకు రోజు నూనె పెట్టాలి, లేదా వారనికి 2 సార్లు రాత్రి నూనె పెట్టి నిమ్మదిగ 15 లేక 20 నిమిషాముల పాటు మర్దన చేసి, ఉదయం కుంకుడు కాయలతో కాని, శిక కాయతో కాని తల



స్నానము చేయాలి .బట్టతల మొదలు అవుతునపుడె త్రిఫలాలు (వుసిరి,కరక్కయ, తానికయలు) అన్ని 10, 10 ముక్కల చొప్పున తీసుకుని, రాత్రి నాన పెట్టి, ఉదయానే నీటిని వడ పోసి, ఆ నీటిని తలకు వ్రాసుకోవాలి, రోజు చేయలి, బట్టతల రాదు, వచ్చిన చోట జుట్టు వస్తుంది

## కంటి చూపు సమస్యకు..

కంటి చూపు సమస్యకు కరక్కాయల పొడి 30 గ్రా, తానికాయల పొడి 60 గ్రా, ఉసిరికాయల పొడి 90 గ్రా, అథి మధురం పొడి 10 గ్రా, వెదురుప్పు (తెల్లగ వుంటుంది) 10 గ్రా, పిప్పళ్ళ పొడి దోరగావేయించి పొడి చేయాలి 20 గ్రా, పటిక బెల్లం పొడి 440 గ్రా, (పైన పొడులు అన్ని కలిపిన దానికి రెండు రెట్లు పటిక



బెల్లం వేయాలి), అన్ని పొడులు బాగ కలిపి, గాజు సీస లో నిల్వ చేసుకోవాలి, 10 సంవత్సరాల లోపు ం 1/4 స్పూను పొడి, 1/4 స్పూను నేయ్యి, 1/2 తేనె అనగా మూడు వేళ్ళతో వచ్చినంత పొడిని తీసుకోవాలి, పెద్దవాళ్ళకు 1/2 స్పూను, 1/2 స్పూను నేయ్యి, 1 తేనె వయస్సును బట్టి మోతాదు ఇవ్వాలి,ఇలా వాడుతు వుంటె కొన్ని రోజులకు కళ్ళ అద్దాలను తీసేయవచ్చు

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 02, మార్చి 2024



భక్తి

# రోగాలను నయం చేసే శివుడు

## అద్భుతమైన పుణ్యక్షేత్రం

# ఉన్కేశ్వర్ శివాలయం

**రామచంద్రుడు ప్రతిష్ఠించిన ఆ లింగాన్ని తాకితే ద్వాదశ జ్యోతిర్లింగాలనూ దర్శించుకున్నంత పుణ్యమట. అంతేకాదు ఈ శివుడ్ని ప్రత్యేకంగా రోగనాశకుడిగా చెబుతారు. అక్కడి వేడినీళ్ల కుంటలో స్నానమాచరిస్తే శరీరం ఆరోగ్యవంతమవుతుందట. ఆ సుప్రసిద్ధ క్షేత్రమే మహారాష్ట్రలోని ఉన్కేశ్వర్! రామచంద్రమూర్తి వనవాస కాలంలో అనేకానేక అడవుల్లో పర్యటించాడంటారు.**

అందులో భాగంగానే ఉన్కేశ్వర్ సమీపంలో సీతాలక్ష్మణ సమేతంగా నివాసమున్నాడట. ఆ సమయంలోనే ఓ భక్తుడి వ్యాధుల్ని నయం చేసేందుకు ఆయనే ఈ క్షేత్రాన్ని సృష్టించాడట. భక్తుడి మీద అపార కరుణా వాత్సల్యాలు కలిగి ఉండే దశరథనందనుడు ప్రతిష్ఠించిన ఈ ఆలయంలోని శివుడూ విశేష మహిమాన్వితుడే.

అందుకే త్రేతాయుగం నుంచీ నేటి వరకూ ఈ చోటికి భక్తులు బారులు కడుతూనే ఉన్నారు. ఉన్కేశ్వర్ శివాలయం మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా మాండ్వి దండకారణ్యం పరిసరాల్లో విరాజిల్లుతోంది. మహారాష్ట్ర, ఆదిలాబాద్ సరిహద్దులో ఉన్న ఈ దేవాలయంలో భక్తులకు ఉచిత ప్రకృతి వైద్యమూ అందిస్తున్నారు. అందులోనూ చర్మ వ్యాధులు బాగా నయమవుతాయని భక్తుల నమ్మిక.

### స్థల పురాణం...

ఉన్కేశ్వర్ దండకారణ్యంలో శ్రీరామచంద్రుడు పాదం మోపడంతో పరిసర ప్రాంతమంతా పవిత్రమైందని చెబుతుంటారు. వాల్మీకి రామాయణంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. పూర్వం శర్భంగుడు అనే రుషి ఉన్కేశ్వర్ పరిసరాల్లోని దట్టమైన అడవుల్లో రామజపం చేస్తుండేవాడట. అతనికి చర్మ వ్యాధులు సోకడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అయినా క్షణం విరామం లేకుండా రామనామాన్ని స్మరిస్తూనే ఉండడాన్ని శ్రీరామచంద్రుడు గ్రహించాడట.

అందుకే ఆయన వనవాస కాలంలో ఉన్కేశ్వర్ దండకారణ్యంలోకి వచ్చి శర్భంగుడ్ని కలవాలనుకున్నాడట. అయితే రాముడిని దర్శించుకోవడానికి శర్భంగుడు తనరూపాన్ని అడ్డంకిగా భావించాడు. ఆ విషయాన్ని లక్ష్మణుడు పసిగట్టాడు. ఈ విషయాన్ని రాముడికి వివరించాడు. చలించిపోయిన రాముడు ఉన్కేశ్వర్వైపు రెండు బాణాలు సంధించాడట. అందులో ఒకటి వ్యాధులను మటుమాయంచేసే సరోవరస్థాపనకూ, మరొకటి మహాశివ లింగ ప్రతిష్ఠాపనకూ కారణమయ్యాయి. అనంతరం శర్భంగరుషికి దర్శనమిచ్చిన శ్రీరామచంద్రుడు తొలుత వేడినీటి సరోవరంలో స్నానమాచరించి, మహా శివలింగాన్ని పూజించమని చెప్పాడు. అలాచేసిన శర్భంగరుషి వ్యాధులన్నీ మటుమాయమయ్యాయి. అనంతరం అటవీ పరిసరాల్లోని ఎందరికో ప్రకృతి వైద్యం అందజేసిన శర్భంగరుషి జీవసమాధి అయ్యాడట. ప్రస్తుత దేవాలయం ఆయన సమాధి దగ్గరే నిర్మించారట.

### రాణి హయాంలో...

18వ శతాబ్దంలో మాల్వ రాజ్యాన్ని ఏలిన అహల్యాబాయి సాహిబా హెూల్కర్, తన హయాంలో దేశవ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం నీటి కుంటలూ, బావులూ, పుష్కరఘాట్లూ, విశ్రాంతి భవనాలతోపాటూ, దేవాలయాలను నిర్మించారు.

వీటితోపాటు దేవతలు కొలువైన కాశీ, గయా, అయోధ్య, ద్వారక, మధుర, జగన్నాథపురి తదితరచోట్ల పలు ఆలయాల నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగానే ఉన్కేశ్వర్ శివాలయాన్నీ నిర్మింపజేశారట. రోగవిముక్తి... ఆలయంలోని వేడినీటి సరోవరంలో కొన్నిరోజులపాటు వరుసగా స్నానమాచరిస్తే ఎంతటి చర్మవ్యాధులైనా నయమవుతాయన్నది భక్తుల నమ్మకం. అక్కడి నీళ్లలో ఉండే సల్ఫర్ వల్ల ఇది సాధ్యమవుతోందన్నది నిపుణుల మాట. అందుకే దేశం నలుమూలల నుంచి ఎందరో వ్యాధిగ్రస్తులు ఇక్కడికొస్తుంటారు. ఆలయం వారే ఇక్కడ ఒక ప్రకృతి వైద్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.



దాదాజీ అనే ప్రకృతి వైద్యుడు చాలా కాలంగా ఇక్కడ సేవలందిస్తున్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆశ్రమంలో రోగులు ఉండేందుకు వసతి సదుపాయం ఉంది. ఈ సేవలన్నీ ఉచితమే. ప్రస్తుతం ఈ ఆశ్రమంలో 100 మందికిపైగా రోగులు వైద్యం పొందుతున్నారు. వీరంతా రోజూ ఇక్కడి వేడినీటి సరోవరంలోని నీటితో స్నానమాచరించి, దైవదర్శనం చేసుకున్న తర్వాత దాదాజీ ఆధ్వర్యంలో యోగా, ధ్యానం, తదితర వ్యాయామాలు చేస్తారు.

తెల్లమచ్చలు, సొరియాసిస్, పక్షవాతం, స్కెలిరోడర్మ తదితర వ్యాధులవారు ఎక్కువగా ఇక్కడికి వస్తుంటారు. నిత్య హారతి... అన్నదానం శైవ సంప్రదాయం ప్రకారం ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తారు. బ్రహ్మముహూర్తంలో హారతితో పూజ మొదలవుతుంది. అనంతరం గాయత్రి మంత్ర జపంతో ఆలయం మార్మోగుతుంది. రోజూ భజనలు జరుగుతాయి.

ఈ ఆలయంలో దత్తాత్రేయుడి ప్రతిమా ఉంది. మహాశివరాత్రి, దత్తజయంతి, రామనవమి, వినాయక చవితి పండుగలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి, దత్తజయంతులకి జాతర కూడా చేస్తారు. సరిహద్దు ప్రాంతం కావడం వల్ల మరాఠాలతో పాటు తెలుగు భక్తులూ పెద్ద ఎత్తున ఆలయానికి వస్తారు.

రోజూ ఇక్కడికి వచ్చే భక్తులతోపాటు, వైద్యం పొందేవారికి అన్నదానం జరుగుతుంది. అదిలాబాద్ నుంచి 56 కిలోమీటర్ల దూరం ఉన్నా ఈ క్షేత్రానికి బస్సు రైలు సౌకర్యం ఉంది నాందేడ్ నుంచి గంట గంటకు బస్సు సౌకర్యం కలదు.

- శ్రీనివాసులు

# అరుణాచల శాపవిమోచనం

## 'అరుణాచల గిరి ప్రదక్షిణమార్గం' పుణ్య చరిత్ర

ఒకప్పుడు పరమేశ్వరుని అంశతో జన్మించిన దూర్వాస మహాముని నిత్యమూ పరమశివుని అర్చించే నిమత్తం ఒక అందమైన పూలవనం పెంచి, చేరువలో కుటీరం నిర్మించుకుని శివధ్యానంలో కాలం గడుపుతుండేవాడు. ఇలావుండగా ఒకనాడు 'కళాధరుడు', 'కాంతిశాలి' అనే యిరువురు గంధర్వులు ఆకాశమార్గాన దేవవిమానంలో వెళుతూ, ఆపూలవనం చూసి, అబ్బురపడి మనసునిలవక కిందకిదిగి అందులో ప్రవేశించారు.

కళాధరుడు యిచ్ఛవచ్చినట్లు పూలనుతుంచి వాసన చూస్తూండగా, కాంతిశాలి ఒళ్ళుమరచి పూలమొక్కల్ని తొక్కుతూ వనమంతా తిరగసాగాడు. అలికిడికి కుటీరంనించి బయటకు వచ్చిన దూర్వాసుడు జరుగుతున్నది చూసి కోపంపట్టలేక వారిని జంతువులుగా భూమిపై పుట్టమని శాపంపెట్టాడు. తెలియక జరిగిన తప్పిదమనీ, శాపవిమోచన మీయమనీ గంధర్వులు చేసిన అభ్యర్థనలకు శాంతించిన దూర్వాసుడు, 'అరుణగిరి' ప్రదక్షిణంతో తిరిగి స్వస్వరూపాలు పొందగలరని విమోచనమార్గం అనుగ్రహించాడు.


ఫలితంగా ఒకరు అరుణగిరిని ఆవరించిన అడవులలో అందమైన పునుగుపిల్లి (కస్తూరిమృగం) గాను, మరొకరు పాండ్యదేశపు రాజధాని మదురై పట్టణంలో చక్కనైన గుర్రంగాను జన్మించారు. ఆదేశపు రాజైన వజ్రాంగదపాండ్యుడు ఆగుర్రపు లక్షణాలకు ముచ్చటపడి దానిని తన రాజాశ్వంగా ఎంచుకున్నాడు. రాజైనవాడు వినోదంకోసం, అప్రమత్తత పెంచుకోవడం కోసం ఒంటరిగా అడవులకు వెళ్ళడం రివాజు. అలా ఒకనాడు వజ్రాంగదుడు మదురై పట్టణానికి చాలా దూరంగా దట్టంగాకమ్మిన అరుణగిరి అరణ్యాలలోకి తన రాజఅశ్వాన్ని అధిరోహించి వేటకు వెళ్ళాడు.

అప్పటికి 'అరుణగిరి' నానావిధ వృక్షజాతులతో కప్పబడి వన్య ప్రాణులకు తప్ప మానవుల దృష్టికి మరుగైవుండేది. అలాంట ప్రాంతంలో ధీరుడైన వజ్రాంగదుడు వేడుక తీర్చుకోవడానికై అడవిమృగాల కోసం వెదకసాగాడు. ఎప్పటికో మధ్యాహ్నందాటిపోయి, వేసారి వెనుదిరుగుదామనుకున్నంతలో ఒకపొద కదలికల వెనక మిలమిలమెరిసే కళ్ళతోదాగిన పునుగుపిల్లి అతని కంటబడింది. దానిని ప్రాణాలతో పట్టుకోవాలని ఆశించి, రాజు వల విసిరే వ్యవధిలోనే అపాయాన్ని కనిపెట్టిన ఆపిల్లి, నేర్పుగా తప్పించుకుని కనిపించి కనుమరుగౌతూ గిరిని చుట్టుముట్టి పరుగిడ సాగింది.

పట్టువదలని రాజు అశ్వంపై దానిని వెంబడించగా, ప్రదక్షిణం పూర్తికావడంతో శాప విమోచనమై అది తూలిపడి తన శరీరాన్ని విడిచింది. విభ్రాంతుడై రాజు అశ్వంపైనించి దిగడంతో అతని గుర్రంకూడా నిలువునా కూలబడి ప్రాణం వదిలింది. మరుక్షణంలో వాటి శరీరాల్లోంచి వెలుగులీనుతూ యిరువురు గంధర్వులు బయటకురాగా అదేక్షణంలో రత్నాలు పొదిగిన దేవవిమానం వారిని తీసుకుపోయే నిమిత్తం ఆకాశం నించి వచ్చి ఆగింది.

ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్న రాజు ఆ దివ్యపురుషులను ఆపి, "సంగతేమిటో వివరించి సందేహ నివృత్తి చేయవలసింద"ని ప్రార్థించగా వారు తమ శాపవృత్తాంతం అంతా చెప్పి, "రాజా! ఈ కనిపిస్తున్న గిరి ఎంతో మహిమాన్వితమైనది. సాక్షాత్తూ ఆది దేవుడైన పరమేశ్వరుడే ఈ గిరిరూపంగా వెలసివున్నాడు. భక్తితోతప్ప దీని రహస్యాన్ని తెలుసుకోవడం సాధ్యంకాదు. బ్రహ్మాది దేవతలుసైతం రోజూ ఉదయానే చప్పుడు చేయకుండా వచ్చి దీనిని పూజించి వెళ్తుంటారు.

అటువంటిగిరిని ప్రదక్షిణంచేసే భాగ్యం మాకు నీకారణంగా కలిగి శాపవిమోచనమైంది" అని అన్నారు. వెంటనే రాజు అంజలి ఘటించి "మహాత్మ్యమైన ఈగిరిని మీతోపాటే ప్రదక్షిణంచేసిన నాకు ఏఫలితమూ కలగని కారణమేమిటి? తెలుపవలసింది" అని వినయంగా అర్థించగా "రాజా! ఈ గిరిప్రదక్షిణాన్ని




వాహనంతోగాని, పాదరక్షలతోగాని చేయరాదు.

నీవు అశ్వంపై ఉండిపోయావు. అలాకాక దీనిని మనసులో స్మరిస్తూ సవ్యదిశలో కాలినడకన ప్రదక్షిణం చేసినట్లయితే వారు ఏదికోరితేఅది, చివరికి ఇంద్రపదవినయినా పొందగలరు" అని వివరించి, గంధర్వులు సెలవుతీసుకొని విమానం అధిరోహించి తమలోకాలకు వెళ్ళిపోయారు.

ఈ ఘటన బలంగా నాటుకున్న వజ్రాంగదుడు, ఇంద్ర పదవిని కోరుకుని సకల భోగాలను సౌఖ్యాలను తిరస్కరించి, రాజ్యాన్ని తరువాతివారికి ఒప్పజెప్పి, రోజుకు మూడుసార్లు చొప్పున మూడు సంవత్సరాలపాటు తదేక దీక్షతో గిరికి ప్రదక్షిణాలు చేయగా ఒక ముహూర్తాన అరుణగిరినాథుడు ప్రత్యక్షమై ఏంవరం కావాలో కోరుకొమ్మని అడిగాడు. అప్పటికి ఎన్నోరోజులుగా ఆ జ్ఞానతేజస్సును ప్రదక్షిణాలతో ఆరాధిస్తూ వుండడంవల్ల పక్వచిత్తుడైన రాజుకు ఆశలూ భయాలూ ఎండుమట్టల్లా రాలిపోయి, ఇంద్రపదవికూడా గడ్డిపరకలాతోచి, తనకి అహంకార రహిత శాశ్వత సాయుజ్య మీయవలసిందని వేడి అరుణగిరిలో లీనమైపోయాడు.

నేడు 'అరుణాచల'మని పేరుబడ్డ అరుణగిరిపుణ్యక్షేత్రం తమిళనాడుకు చెందిన తిరువణ్ణామలైలో వుంది. కోరికలీడేర్చే ఈగిరిని దేశ విదేశీయులెందరో అగ్నిలింగంగా భావించి ప్రదక్షిణం చేస్తారు. నేటి ఈ ప్రదక్షిణమార్గపు మొత్తం చుట్టుకొలత 8 మైళ్ళు (సుమారు 14 కి.మీ.). అలనాడు పాండ్యరాజు వజ్రాంగదుడు మూడు సంవత్సరాలపాటు ప్రదక్షిణంగా నడవగా ఏర్పడిన మార్గమిది. ఈదారిలో ఇప్పుడు మనకు కనిపించే దేవాలయాలు, కొలనులు, విశ్రాంతి మంటపాలు మొదలైనవాటిలో కొన్ని ఆకాలంలో అతను నిర్మించినవే. వీటిలో దుర్వాస మహాముని ఆలయంకూడా మనకు కనిపిస్తుంది.

(సేకరణ)

కెర్లెపల్లి బాలసుబ్రమణ్యం

# ఆధ్యాత్మికతలో ఉన్న పరమ రహస్యం


దైవాన్ని గుర్తించి, నోరెత్తకుండా తన పని తాను చేసుకుపోవడమే ఆధ్యాత్మికతలో ఉన్న పరమ రహస్యం. చాలామంది సాధకులు భగవంతుణ్ని తెలుసుకున్న తరవాత మౌనం వహించారు. ఎందుకు? ఈశ్వరుడు ఆడిస్తున్న నాటకాన్ని సాక్షిగా చూస్తూ లోపల పరమానందాన్ని వాళ్లు పొందుతున్నారు. ఇది నిజమా, ఇదే నిజమా? శాస్త్రాలు, గురువులు ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నప్పుడు- విశ్వసించాలి మరి.

అన్ని అనుభవాలూ మనకు సూటిగా లభించవు. ఇతరులకు లభించిన దాన్ని ప్రాతిపదికగా తీసుకుని రుజువు చేసుకోవాలి. దీనికి విశ్వాసం కావాలి. అప్పుడే మన లోపల తాళం మనం తెరుచుకోగలం. అంతరంగంలో జరుగుతున్న దాన్ని అనుభూతిలోకి తెచ్చుకోగలం.

దైవాన్ని గుర్తించడం అంత సులువైన పని కాదు. అది సాదాసీదా పని కాదు. అందరికీ సాధ్యమయ్యేది కాదు. అలా అని వూరుకుంటే మనం నిజమైన మానవులం కాదు. మనకు ఒక బాధ్యత ఉంది. ధర్మం ఉంది. మన జీవితానికి ఒక ప్రయోజనం ఉంది. అన్నింటికీ మించి పరమార్థం ఉంది. దాన్ని గుర్తించాలి.

నన్ను గుర్తించు అంటూ దేవుడు మన దగ్గరకి రాడు. మన సుఖం కోసం శాంతి కోసం ధన సంపాదన ఎలా అయితే చేస్తున్నామో, ఈశ్వరారాధనా అలాగే చెయ్యాలి. ఆధ్యాత్మిక ఐశ్వర్యాన్ని పొందాలి. ఈ విషయాన్ని ఉపనిషత్తులు ఉద్బోధిస్తున్నాయి.

లౌకిక జీవనం సుఖవంతం కావడానికి



ఎంతోమంది శాస్త్రజ్ఞులు జీవితాలు అంకితం చేశారు. అపార కృషి చేశారు. అలౌకిక మార్గంలో నడిపించి దైవసాన్నిధ్యం కల్పించడానికి ఎందరో మహానుభావులు తపించారు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుని జీవనం సాగించడం ఉత్తమ మానవుడి లక్ష్యం. ఏది వదిలిపెట్టినా జీవితం పరిపూర్ణం కాదు. వనం ఉండాలి. వసంతం ఉండాలి.

అందులో కోయిల ఉండాలి. అప్పుడే పాట హాయిగా ఉంటుంది! హృదయం ఉండాలి. అందులో ప్రేమ ఉండాలి. దగ్గరకు తీసుకునే చేతులు ఉండాలి. అప్పుడే ఆ పరిష్వంగం ఆనంద రసకందాయమవుతుంది.

తీపిని బెల్లం నుంచి వేరు చెయ్యలేం. కాంతిని సూర్యుడి నుంచి వేరు చెయ్యలేం. కెరటాన్ని సముద్రం నుంచి వేరు చెయ్యలేం. మన జీవనం లోంచి ఆధ్యాత్మికతను వేరు చేసి చూసే అవకాశమే లేదు. అవగాహనకు వస్తున్న కొద్దీ దేవుడు మిత్రుడవుతాడు. మార్గదర్శకుడవుతాడు. గురువవుతాడు. చిట్టచివరకు ప్రేమికుడవుతాడు.

ఎక్కడ మనం ఉన్నామో, ఆ ప్రదేశం ఏమిటో, ఎందుకు మనం ఉన్నామో, ఆ స్థితి ఏమిటో, మనల్ని ఇలా ఉంచినవాడితో సంబంధ బాంధవ్యాలు ఎలా జరుపుకోవాలో తెలియకపోతే- మనకు బుద్ధి ఎందుకు? మనిషికి జంతువుకి తేడా ఏమిటి? హేతుబద్ధంగా ఆలోచించడం విజ్ఞానానికే కాదు, వేదాంతానికీ కావాలి. భగవంతుడు రుజువయ్యాడు. దానికి నిజభక్తులే సాక్ష్యం. భగవంతుడు రుజువవుతాడు. ఆధ్యాత్మిక హృదయం వికసించాలి. ఆ దిశలో మనం కళ్లు తెరుచుకుని చూడాలి.

'జీవిత లక్ష్యం ఏమిటి?' అని కొత్తగా వచ్చిన ఓ శిష్యుడు బోధకుణ్ని అడిగాడు.

'ఈ జీవితంలో ఎంతో బ్రహ్మానందం ఉంది. కాని, మామూలుగా జీవించాలని మనం అనుకోవడం లేదు. ఏదో సాధించాలని పరుగులు తీస్తున్నాం. జీవించడమే ప్రాతిపదికగా ఉన్న జీవితాన్ని ఓ సాధనంగా మార్చుకోవాలని అనుకుంటున్నాం. ఆశయాల కోసం తీస్తున్న పరుగులే మనలో ఉద్విగ్నతను పెంచుతున్నాయి' అని బదులిచ్చాడు ఆయన.

3
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 02, మార్చి 2024

వెర్రి గొర్రెల్లారా.. ఎన్నికలప్పుడూ అలానే ఉంటారా?

# అలాగే బతకండి...

నీ గూడెక్కడో నీకు తెలియదు.
నీవెందుకు బ్రతుకుతున్నావో ఊహకందదు.
నీవు తినే గడ్డి ఎవరిచ్చారో నీకేనాటికీ అర్థం కాదు.
నా అవినీతిని వెర్రి గొర్రెలు ప్రశ్నించవు.
వాటికి అంత జ్ఞానం లేదు కదా?
నేను దోచుకున్నా దోచుకుంటూనే ఉంటా.
అది దోపిడి అని వాటికి తెలిస్తే కదా?
నేను మీ కాపరిని అంటే వాటికి ఎంత
ఆనందం.
మీ తోలు తీసి అమ్ముతున్నా తెలియని మైకం.
మీ తర తరాలు నాకు చేయక తప్పదు
ఊడిగం.
కులమని మతమని దేవుడని ప్రభువని
మీలో మీరు కొట్టుకోండి.
నాకు కావలసింది ధనమే.
అందుకు తల్లి లేదు చెల్లి లేదు చిన్నాన్న కూడా లేదు.
నా లక్ష్యం సుస్పష్టం.
నేనున్నంతకాలం రాచరికం.
అడ్డొస్తే సర్వం నాకు విరోధం.
నా కోర్కెలు తీరాలంటే
మూరు?లైన మీరే నాకు సహాయం.
నేను చేసిన హత్యలు మీకొరకేనంటే
తల ఊపే మీ ఉబలాటం మీ భావి మరణశాసనం.



నేను మానసిక రోగినైనా
మీ మూర?త్వం తో జన నేతనైనాను.
నాకు ఏదీ చేతకాకున్నా
మీ చప్పట్లతో కార్యశూరుడైనాను.
క్రింది గడ్డి తినడమే తప్ప
తలెత్తి చూడలేని మీకన్నా నాకు ముఖ్యులెవరు?
నేను చేసే అప్పుల్లో మీకిచ్చేది రేణువంతైనా
మీ జన్మ ధన్యమనుకునే
మీకంటే ఆప్తులెవరు నాకు?
మీ ఉన్మాదం సాక్షిగా నేనిచ్చే సందేశం ఇదే.
మీరు తలొంచుకు గడ్డి మేయండి.
మీ పేరుతో నా విషాన్ని నేను వెళ్ళగ్రక్కుతాను.
పెత్తందార్ల పేరు చెప్పి నేను పెత్తనం
చేస్తా.
అసలు పెత్తందారుడ్ని నేనే.
మీకు ఆలోచించే సమయం ఇవ్వను.
మీ బ్రతుకంతా నా గుప్పెటపడతా.
నా వెనుక గొర్రెలున్నంత కాలం.
నేను ప్రభువు ప్రవచించిన కాపరినే.
ఆ ప్రభువు చెప్పినవి మీకు తెలియదు.
మధ్యలో నేను మార్చి చెప్పాను
కదా?

**- ఆళ్ల హరి**

# పాత దీపాలను పడవేయకండి

దీపాలు పాతవి అయిపోతే చాలా మంది వాటిని మార్చేస్తారు. ఎపుడో ఒకసారి దీపాలు పెట్టే వాళ్ళు ఎలా చేసుకున్న పర్వాలేదు. కానీ నిత్యం దీపారాధన చేసుకునే ఆడవాళ్లు, ఆ పాత దీపాలను మార్చుకోకూడదు.

మరి పాతవి దేవుడి ముందు బాగాలేదు అనుకుంటే,



అవి తులసి కోట దగ్గర అయినా పెట్టండి. లేదా కాలం చేసిన పెద్దవారి ముందు అయినా పెట్టండి. కానీ పాతవి అయిపోయింది అని మూలన పెట్టకండి, మార్చకండి.

ఎందుకంటే మన కుటుంబంలో మనుషులుగా మనతో దీపాలకు కూడా ఒక బంధం ఉంటుంది, అవి బొమ్మలు కాదు ప్రత్యక్షంగా దైవస్వరూపాలు, మన సంతోషాలు కష్టాలు, కనీళ్లు, బాధ్యతలు పంచుకున్న మన ఆప్తులతో సమానం, మనము ఒక కష్టాన్ని భగవంతుడు కి చెప్పుకుంటే, మన పూజ గదిలో దీపాలు కూడా భగవంతుడు ని ప్రార్తిస్థాయి. మనము సంతోషంగా దీపం పెట్టి పూజ చేసి నప్పుడు భగవంతుడు కి కృతజ్ఞతలు చెప్పుకుంటాయి.

దీపం లో నూనె అయిపోతే కొండెక్కి పోతుంది అనుకుంటారు. ఆ ప్రమిద చివరి భాగంలో గూడు కట్టిన మసిలో, దీపం ఇంటి యజమాని వచ్చే వరకు ఆ ఇంటి ఇల్లాలుకి తోడుగా ఉంటుంది, ఆమె భర్త బిడ్డలు క్షేమంగా ఇల్లు చేరాలి అని భగవంతుడు ని ప్రతిస్తూ ఉంటాయి అంటారు అందుకే చాలా కాలం గా పూజించిన దీపాలకు కూడా చాలా విలువ ఉంటుంది మహిమ ఉంటుంది.. ప్రాణంవుంటుందిపాత దీపాలు అనుకోకుండా శుభ్రంగా ఉంచి వాడుకోండి.

**- హైందవ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్**

# అక్కడైతే కాల్చేస్తారు

**చైనాలో అయితే కిడ్నాప్ చేస్తారు**
**భారత్‌లో అయితే రేషన్‌కార్డులిచ్చి**
**ఓటు హక్కులిస్తారు**
**ఇదేం సెక్యులరిజం?**
**చొరబాటుదారులకు భారత్ స్వర్గధామమా?**

వేదిక




మీరు "దక్షిణ కొరియా" సరిహద్దు అక్రమంగా దాటితే,12 సంవత్సరాలు జైలులో పెడతారు.
"ఇరాన్" సరిహద్దు అక్రమంగా దాటితే నిరవధికంగా అదుపులోకి తీసుకుంటారు .
"ఆఫ్ఘనిస్తాన్" అయితే చట్టవిరుద్ధంగా సరిహద్దును దాటండి. మిమ్మల్ని చూడగానే షూట్ చేయండని ఆర్డర్ ఇవ్వబడుతుంది.
మీరు "చైనీస్" సరిహద్దును అక్రమంగా దాటి తే మిమ్మల్ని కిడ్నాప్ చేస్తారు. మీరు మళ్ళీ కనపడరు .
మీరు "క్యూబా" సరిహద్దు అక్రమంగాదాటితే కుట్ర చేసినందుకు జైలు పాలైతారు.
మీరు "బ్రిటిష్" బోర్డర్ అక్రమంగా దాటితే, మీరు అరెస్టు చేయబడతారు. విచారణ జరుగుతుంది, జైలు శిక్ష పడుతుంది.
మీరు పొరుగు దేశానికి చెందినవారై..చట్టవిరుద్ధంగా భారత దేశ సరిహద్దు దాటి వస్తేనో.
అప్పుడు మీరు పొందుతారు.
1 ఒక రేషన్ కార్డు
2 పాస్పోర్ట్,
3 డ్రైవింగ్ లైసెన్స్,
4 ఓటరు
గుర్తింపు కార్డు, 5 క్రెడిట్ కార్డులు, 6 ప్రభుత్వ రాయితీ అద్దె వసతి, 7 ఇల్లు కొనడానికి రుణాలు, 8 ఉచిత విద్య, 9 ఉచిత ఆరోగ్య సంరక్షణ, 10 న్యూ ఢిల్లీలో లాబీయిస్ట్, 11 ఒక టెలివిజన్. మరో 12 మంది మానవ హక్కుల నిపుణులు, వామ పక్ష కార్మికుల సమూహంతో, కాంగ్రెస్ లౌకికవాదం ట్రంపెట్ హక్కు. హైదరాబాద్ పాతబస్తీలో వేలాదిమంది రోహింగ్యాలకు ఒక రాజకీయ పార్టీ ఆశ్రయం ఇచ్చింది. అంతేకాదు. వారికి రేషన్‌కార్డులూ ఉన్నాయట.
ఇన్ని సౌకర్యాలు క ల్పించిన దేశభక్త పార్టీలు, ఓటు హక్కు కూడా కల్పించడం కూడా సహజం. ఇది పశ్చిమ బెంగాల్‌లోనే కాదు. మన దగ్గరా దర్శనమిస్తున్న దేశభక్తి దృశ్యాలు.

మీ వక్రపుటాలోచనల విషాన్ని మాపై ఒంపకండి

# మీ దుష్టత్వంతో మమ్మల్ని దెబ్బకొట్టకండి

"మకాలి ఉమ్మిని విద్య అని మీరు చప్పరిస్తూంటారు.
విదేశీ నీచులు మన ఆలయాల్ని కూల్చి ఈ గడ్డ సంపదల్ని కొల్లగొడితే "అలాంటిదేం జరగలేదు" అని మీరు అరుస్తున్నారు. ఇక్కడి స్త్రీల మాన ప్రాణాల్ని హరించిన వాళ్లను మీరు ఆరాధిస్తారు. ఇక్కడ నరమేధం సృష్టించిన వాళ్లను మీరు ప్రేమిస్తారు. చొరబడ్డ దొంగల్ని "దొరలు" అని అంటారు మీరు. మీ అబద్ధం మీది. అది మాకు వద్దు. వినాశకర విదేశీ వర్ణాలను మీరు బాగా పులుముకున్నారు. ఈ మట్టికో రంగుంది. అది మీకక్కర్లేదు. మీకు విదేశీ మతోన్మాదపు రంగు కావాలి. ఇక్కడి విశ్వవిద్యాలయాలను కాల్చేసిన త్రాష్టుల్ని మీరు తలకెక్కించుకుంటారు. "అసలిది దేశమే కాదు" అంటారు మీరు.
"ఇక్కడేమీ లేదు" అంటారు మీరు. మీ తాత, తండ్రుల గుఱించి ఎవడో చెబితేకానీ నమ్మరు మీరు. మీ భ్రష్టత్వం మీది. అది మాకు వద్దు. చదవడం చాతగాక మీరేం చదివారో మీకే తెలియకుండా తెగ చదివేశారు. మీ మాటల్ని విని ప్రపంచం ఎంత నవ్వుతున్నా మీ వంకర మీదే.
మీ వికారాన్ని మాపై విసరకండయ్యా. మాకు మీ వికృతత్వం వద్దు. మేం పామరులం,
మేం సామాన్యులం, మేం ప్రజలం
అయ్యా మేధావుల్లారా, మామీద పడకండి
మేమో, ఈ దేశమో మీకు ఏ హానీ చెయ్యలేదు కదయ్యా?
మీరెందుకు మాకు హాని చేస్తున్నారు? ఈ మట్టికి ఎందుకు కీడు చేస్తున్నారు?
మీ మేధను మాపై ఎందుకు వాంతిచేస్తున్నారు? మీ దుర్గంధాన్ని భరించలేకపోతున్నామయ్యా.. మమ్మల్ని వదిలెయ్యండయ్యా
అయ్యా మేధావుల్లారా, మాకు మీ రొష్టు వద్దయ్యా మీవల్ల మా ఆరోగ్యాలు చెడిపోతున్నాయయ్యాబీ మా మానాన మమ్మల్ని బతకనియ్యండయ్యా
మేం ప్రశాంతంగా బతకాలయ్యా. వినాశనాన్ని "విశేషం" అని మీరంటారు.
నష్టాన్ని "లాభం" అని మీరంటారు.
పామరులం, సామాన్యులం, ప్రజలం
మేధావుల్లారా, మీరు మాకు వద్దు.లేనిదాన్ని చదవి "ఉన్నది ఇది" అని మాకెందుకు చెబుతున్నారు? ఉన్నది ఉన్నట్టుగా మీకెందుకు కనిపించడం లేదు? "మిమ్మల్ని చెడగొట్టాం" అని చెడగొట్టిన వాళ్లే గట్టిగా చెప్పినా వినరు మీరు. పైగా మమ్మల్ని చెడగొట్టడానికి ఉద్యమాలు చేస్తున్నారు మీరు. "ఔరంగజేబ్ మంచి వాడు" అని మీరంటారు.
మేం మీ మాటలను వినలేం. మేం చెడిపోయి మనలేం. ప్రపంచానికి పనికిరాని సిద్ధాంతాల్ని మీరు ముసుగులుగా వేసుకున్నారు. మీ ముసుగులతో మాకు పనిలేదు.
మీ ముసుగులతో మాపై బుసకొట్టకండి. మీ తుచ్ఛత్వం మీది. మేం మీలా కాలేం. మేం మామూలుగా బతకుతున్నాం. మీకు సిగ్గులేదా? మీ బుద్ధి ఎందుకు గడ్డి తింటోంది? మీరు ఎందుకు సరిగ్గా లేరు? అని అడిగితే మీరు విదేశీ ధనంతో మా బతుకులపై



నిప్పులుపోస్తారని మాకు తెలుసు. మీరు విదేశీ మతంవల్ల బలవంతులు. మేం బలహీనులం. మాకు ఏ ఇజాల డబ్బూ రాదు. మేం పామరులం. మేం సామాన్యులం. మేం ప్రజలం. మాకు ఈ మట్టి అంటే ఇష్టం.
మాకు మేమంటే ఇష్టం. మాకు మా భవిష్యత్తు అంటే ఇష్టం.
కాబట్టి మేధావుల్లారా మమ్మల్ని వదిలెయ్యండి. అయ్యా మేధావుల్లారా, మేం ఈ మట్టి బిడ్డలంబీ మేం ఈ మట్టి పాట పాడుకుంటాం.
మమ్మల్ని వదిలెయ్యరూ? మీరు చేసే రచ్చలవల్ల మా పాట సాగడం లేదు. మా బాటకు మీరు అడ్డం. మాకు మీరు అపాయం. మీరు రెచ్చిపోతూండడం వల్ల మా క్షేమం చచ్చిపోతోంది. మా ఉనికికి మీరు ఉరి వేస్తున్నారు. మీ మేధకు మా భావాలు, భాగ్యాలు ఆహుతవుతున్నాయి. మేధావుల్లారా మమ్మల్ని చంపకండి. మేధావుల్లారా, మీరు మాకు వద్దు. తొందఱగా ఎక్కడికైనా వెళ్లిపొండి మేధావుల్లారా,
మా బతుకులు మేం బతుకుతాం.
మేం ప్రశాంతంగా ఉంటాం.
ఈ గొప్ప మట్టినిమా సంతతికి మేం కానుకగా ఇచ్చుకుంటాం.

**- రోచిష్మాన్**
**9444012279**

# 'రూల్ అఫ్ లా'

'రూల్ ఆఫ్ లా ' అని ప్రతి సమాజం లోనూ ఒకటి ఉంటుంది. అది ప్రజాస్వామిక వ్యవస్థ అయినా, రాచరిక వ్యవస్థ అయినా, నియంత్రత్వ వ్యవస్థ అయినా మయన్మార్ లాగా అడ్డగోలు మిలిటరీ వ్యవస్థ అయినా బీ అక్కడి సమాజానికి ' రూల్ అఫ్ లా' అంటూ ఒకటి ఉంటుంది. అడవుల్లో జీవించే జంతువులకే 'రూల్ అఫ్ లా ' ఉండదు. అసలు 'లా' అనేదే ఉండదు కనుక. మనుషులు నివసించే సమాజం లో. ఆ సమాజం లోని 'రూల్ అఫ్ లా' ను పాటించి తీరాలి. ఈ నిబంధలు, చట్టాలు ఒక్కో సమాజానికి ఒక్కో విధం గా ఉండవచ్చు. నిజానికి, ఏ సమాజం లో అయినా 99శాతం మంది పౌరులు ఎవరూ చెప్పకుండానే 'రూల్ అఫ్ లా ' ను పాటిస్తారు. ' రూల్ అఫ్ లా' అనేది ఒకటి ఉంటుందని తెలియకుండానే పాటిస్తూ ఉంటారు. సింపుల్ గా చెప్పుకోవాలి అంటే, ఎవరి బతుకు వారు – ఎదుటి వారికి ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా బతకడమే – 'రూల్ అఫ్ లా '. 99 శాతం మంది ప్రజలు ఏ సమాజం లో అయినా ఇలాగే బతుకుతూ ఉంటారు. ఎటొచ్చీ ఆ ఒక్క శాతం తోనే. ఏ పౌర సమాజానికైనా ఇబ్బంది కలుగుతుంది.. గణాంకాలుగా చూసి, ఒక్క శాతమేగా అని తేలికగా తీసుకునే ప్రమాదం లేక పోలేదు.

మాట వరుసకు ఆంధ్రప్రదేశ్ జనాభా సుమారు అయిదు కోట్ల ముప్ఫయ్ లక్షలు. ఇందులో 99 శాతం మంది – అంటే – అయిదు కోట్ల ఇరవ నాలుగు లక్షల డెబ్బయ్ వేల మంది పౌరులు తు. చ. తప్పకుండ ' రూల్ అఫ్ లా ' ను పాటిస్తున్నారు అనుకుందాం.

ఇక, మిగిలిన ఒక్క శాతం మంది – అంటే – అయిదు లక్షల ముప్ఫయ్ వేల మంది మాత్రమే 'రూల్ అఫ్ లా ' ను అసలు ఖాతరు చేయడం లేదని వాదన కోసం – అనుకుందాం.

వీరు – కారణాలు ఏమైనప్పటికీ – పౌర సమాజం పై హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీలు,మాన భంగాలు, ఫోర్జరీ లు, చీటింగ్ లు, కబ్జాలు, గృహ దహనాలు, శిరో ముండనాలు వంటి చెప్ప లేనన్ని అకృత్యాలకు తెగ బడితే.?! ఈ ఒక్క శాతం ' రూల్ అఫ్ లా ' ఉల్లంఘనుల చేతుల్లో.99 శాతం చట్ట బద్ద జీవనం సాగించే పౌర సమాజం పరిస్థితి ఏమిటి?


ఒక్క శాతం కాదు గదా. ఆ ఒక్క శాతం లో ఒక్క శాతం మంది 'రూల్ అఫ్ లా ' ఉల్లంఘనలకు తెగబడినా.99.99 శాతం పౌర సమాజం తట్టుకోలేదు.

దీనికీ, రాజకీయాలకూ సంబంధం లేదు. రాజకీయాలు అనేవి రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం. ఏమి చెప్పి. అధికారం లోకి వద్దామా అని అవి ఆలోచిస్తుంటాయి.

' రూల్ అఫ్ లా ' ను పాటించడం అనేది పౌర సమాజానికి సంబంధించిన అంశం.

ఏ పార్టీ అధికారం లో ఉన్నది అనే అంశం తో పెద్ద సంబంధం ఏమీ లేకుండానే –

ఈ 'రూల్ అఫ్ లా' ఉల్లంఘనులు పౌర సమాజాన్ని ఈతి బాధలకు గురి చేస్తూ ఉంటారుఒక్కొక్క దేశం లో ఒక్కొక్క రీతిగా ఈ ఉల్లంఘనులతో వ్యవహరిస్తారు. ఉదాహరణకు చైనాలో అయితే. సింపుల్ గా వీరిని ఉరి తీస్తారు. సౌదీ అరేబియాలో అయితే, బహిరంగంగాగా కొరడాలతో కొట్టి జైళ్ళలో పారేస్తారు. రష్యా లోనూ జైళ్ళలో కుక్కుతారు. అమెరికా లో అయితే. అత్యంత కఠిన జైలు శిక్షలు విధిస్తారు.



**భోగాది వెంకట్రాయుడు**

ఉదాహరణకు – అమెరికా అధ్యక్షుడుగా 2020లో జో బైడెన్ గెలుపును ధృవీకరించడానికి సమావేశమవుతున్న అమెరికన్ కాంగ్రెస్ భవనంపై (మన భాషలో పార్లమెంంట్ భవనం ) పైకి దండెత్తిన ట్రంప్ అనుయాయులలో నేరం రుజువైన వారికి వరసబెట్టి 15,16,17,18 ఏళ్ళ జైలు శిక్షలు విధించేశారు.

మన దేశం లో మర్డర్ లు చేసిన వారికి కూడా అంతంత శిక్షలు పడవు. పాకిస్తాన్ లో కూడా మిలిటరీ కోర్టులు ఉరి తీస్తున్నాయి. వారి పట్ల చట్ట బద్ద వ్యవస్థలు అంత కఠినం గా వ్యవహరించక పోతే, సమాజాలు గౌరవప్రదంగా, ప్రశాంతం గా, శాంతియుతం గా జీవించలేవు. 'రూల్ అఫ్ లా ' ఉల్లంఘనులకు కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు, రాజకీయ అభిమాన దురభిమానం లేదు. సమాజాన్ని నంజుకు తినడమే వారికి కులమైనా, మతమైనా, ప్రాంతామైనా, రాజకీయమైనా. వీరు ఉండాల్సింది నిజానికి పౌర సమాజం లో కాదు. జైళ్ళల్లో. మరి, మన సమాజ జీవనం. అటువంటి ఉల్లంఘనుల ఫలితం గా ఎంతగా కలుషితం అయిపోతున్నదో ఆలోచించవలసిన వారు, చర్యలు తీసుకునే బాధ్యత, అధికారం కలిగిన వారు ఉదాసీనం గా ఉంటున్నారు. ఫలితం గా పౌర సమాజాన్ని నంజుకు తినే వారి సంఖ్య ఇబ్బడి ముబ్బిడి గా పెరిగి పోతున్నది. పౌర సమాజం వారి చేతుల్లో ఎంతగా నలిగి, చితికి చిన్నాభిన్నం అయిపోతున్నదో రోజు వారీ దిన పత్రికల జిల్లా ఎడిషన్లు చూస్తే తెలుస్తుంది. వారి అరాచకాలను పౌర సమాజం నిస్సహాయం గా చూస్తుండి పోవలసి వస్తున్నది.. రాజకీయ వ్యవస్థలు వారిని పల్లెత్తు మాట అనవు. వారి నుంచి పౌర సమాజాన్ని కాపాడాల్సిన వ్యవస్థలు. ఆ పని చేయడం లేదనే అభిప్రాయం సమాజం లో గట్టిగా పాతుకు పోతున్నది. ఈ 'భీతావహ' పరిస్థితుల్లో పౌర సమాజపు నడక పరిస్థితి ఏమిటి? భవిష్యత్ తరాల పరిస్థితి ఏమిటి? మరో తరం గడిస్తే – మన సమాజానికి. ఆటవిక సమాజానికి తేడా ఏమిటి? మన తరువాతి తరాల పిల్లలు సగౌరవంగా ఆత్మాభిమానంతో జీవించే అవకాశం ఉంటుందా? " నిజమే!చట్ట బద్ద జీవనం పట్ల నిబద్ధత కలిగిన పౌరులందరా ఆలోచించాల్సిన –పైకి సమస్యలాగా కనపడని– పెను సమస్య ఇది అని సీనియర్ జర్నలిస్ట్ ముసునూరి సోమయజులు, న్యాయవాది ఆరేటి ప్రకాష్ అన్నారు. రాజకీయ రాగ ద్వేషాలతో సంబంధం లేకుండా. ఉల్లంఘనులను రాజకీయాలనుంచి వేరు చేయడానికి ప్రజలే కృషి చేయాలని ఆయన అన్నారు. ప్రవాసాంధ్రుల పైనే భారం

అమెరికాతో సహా పలు దేశాలలో ప్రవాసాంధ్రులు తెలుగు కీర్తి పతాక ను ఎగురవేస్తున్నారు. ఒక్క అమెరికా లోనే పది లక్షల మంది తెలుగు వారు ఉన్నట్టు ఓ అంచనా.

వారు ఇక్కడ – మన రాష్ట్రం లోనే పుట్టారు. ఇక్కడే పెరిగారు. వీధి బళ్ళల్లో చదువుకున్నారు. బురద లోంచి పుట్టి,నవనవోన్మేషం గాపెరిగిన పద్మాల్లా ఇప్పుడు అమెరికా, ఇంగ్లండ్ ఆస్ట్రేలియా తదితర సుదూర ప్రాంతాలలో వైద్యులుగా, పారిశ్రామిక వేత్తలుగా, సాఫ్ట్ వె( ప్రొఫెషనల్స్ గా, పలురకాల వృత్తుల్లో తెలుగు వెలుగులు విరజిమ్ముతున్నారు. వారు ఒక 'సమానావకాశాల' స్వేచ్ఛా సమాజంలో సగౌరవంగా జీవిస్తున్నారు. అయినప్పటికీ, పుట్టి, పెరిగిన నేల తల్లిని మరిచిపోకుండా. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఇతర సేవా కార్యక్రమాలకు లక్షలు, కోట్ల రూపాయలు తృణ ప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. అవకాశం ఉన్నప్పుడల్లా స్వరాష్ట్రం లో పర్యటిస్తున్నారు. పైపెచ్చు తమ తమ అసోసియేషన్లు తమ తమ నివాస దేశాల్లో జరుపుకునే వార్షిక సదస్సులకు తెలుగు నాట ప్రసిద్ధులైన రాజకీయ, సినీ, సాంస్కృతిక, సంగీత, నృత్య, గాయక కళాకారులను ఆహ్వానించి సన్మానించి – మాతృ భాష, మాతృ భూమి పట్ల తమ మమకారాన్ని,అభిమానాన్ని విశేషంగా చాటుకుంటున్నారు. అయితే, వీటితో పాటు – తెలుగు సమాజం లో – రోజు రోజుకూ పేట్రేగి పోతున్న ' రూల్ అఫ్ లా ఉల్లంఘనుల(యాంటి – సోషల్ ఎలిమెంట్స్) కార్యకలాపాలను అధికార, రాజకీయ వ్యవస్థల దృష్టికి బలం గాఎప్పటికప్పుడు తీసుకురావలసిన ఆవశ్యకతను పరిగణన లోకి తీసుకోవాలి. జన సామాన్యం లో ఒక చైతన్యం కలిగించడానికి ఏమి చేయాలా అని కూడా ఆలోచించాలి. విదేశీ తెలుగు పెద్దలు తలుచుకుంటే. కాన్సర్ లాటి ఈ సమస్యకు పరిష్కారం కనపడక పోదు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శనివారం 02, మార్చి 2024



# డబ్బే జీవితం కాదు

ఒక జడ్జి తన వృత్తినుండి పదవీవిరమణ అయ్యాక తన భార్య నుండి తనలోని భావాలను ఇలా పంచుకుంటున్నారు.
"లక్ష్మీ! నేను లాయర్ గా ఉన్నప్పుడు కాని జడ్జిగా ఉన్నప్పుడు కానీ ఈరోజు నేను చూసిన నా చివరి కేసు లాంటిది చూడనే లేదు" అని అన్నాడు.
"ఏంటా కేసు?" అని ఆమె అడగగా
"ఒక తండ్రి తన కొడుకు తనకు నెలకు డబ్బులు ఇవ్వడం లేదని కేసు" అన్నాడు.
కొడుకుని పిలిచి "ఏంటయ్యా నీ తండ్రికి నెలకు సరిపడ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదు?" అని అడిగాను.
"మా తండ్రిగారు ఒక ప్రభుత్వ ఉద్యోగిగా పదవి విరమణ పొందిన వ్యక్తి. నెలనెలా ఆయనకు పెన్షన్ వస్తున్నది. బాగానే డబ్బులు ఉన్న వ్యక్తి. నా పైన ఇలా ఎందుకు కేసు పెట్టాడో అర్థం కాలేదు" అన్నాడు.
ఆ తండ్రి "అవును డబ్బుకు నాకు లోటులేదు, కాని నా కొడుకు నెలకు 100 రూపాయలు కానివ్వండి స్వయంగా వచ్చి అందించేలా తీర్పు ఇవ్వమ"ని అడిగాడు.
తీర్పు చెప్పాక ఆ తండ్రిని కలిసాను "ఎందుకయ్యా ఇలా అడిగావు" అని "మాకు ఉన్నది ఒక్కడే కొడుకు. మీరు ఇచ్చే తీర్పు కారణంగా అయినా నెలకు ఒక్కసారి మా దగ్గరకు వచ్చి మాతో గడిపి వెళ్ళగలడని ఆశ, వాళ్ళ అమ్మకు వాడంటే ప్రాణం?" అని అన్నాడు. ఇలా చెబుతూ ఆయన కళ్ళు తడిచాయి.
డబ్బే ప్రధానం అనుకుంటారు అంత కంటే ఎక్కువగా మనల్ని ఎదురుచూసేవారుంటారు అని గుర్తించలేము. నాకెందుకో అప్పటి కన్నవారికి నేడు ఉన్న తల్లితండ్రులకి చాలా తేడా కనిపిస్తుంది.
మా పిల్లలు డబ్బు సంపాదించకపోయినా పర్లేదు. మా కళ్ళ ముందు ఉంటే చాలు. సరిపడా సంపాదన చాలు అనుకునే వారు..నేడు పిల్లలు అంటే వారు విదేశాలకు వెళ్ళిపోవాలి. లక్షలు సంపాదించాలి అని కోరుకుంటున్నారు.
అందుకే ప్రేమ ఆప్యాయతలు బంధాలు అనేవాటికి విలువ లేకుండా పోయింది . ఎవరైనా ఇవన్నీ పిల్లల నుండి ఎదురుచూస్తుంటే పిచ్చివాళ్ళను చూసినట్టు చూస్తున్నారు. అనురాగం ఆప్యాయత అందని ద్రాక్ష పళ్ళు కాకూడదు కనిపెంచిన తల్లిదండ్రులకు!

- బీఎండబ్ల్యు లక్ష్మి


## టాలీవుడ్‌లో డ్రగ్స్ కలకలం

## చిక్కుల్లో టాప్ డైరక్టర్ క్రిష్

## మరో కీలక మలుపు

# 'తెర' వెనుక డ్రగ్స్






టాలీవుడ్ 'తెర'వెనుక ఏం జరుగుతోంది? 'తెర'చాటున మత్తులో తూగుతోంది ఎవరు? అసలు వారికి మత్తుమందులు సరఫరా చేస్తున్న సూత్రధారులెవరు? పట్టుబడ్డ తారలకు కోర్టులో శిక్ష పడకపోవడానికి కారణమేమిటి? పోలీసుల విచారణ అంత బాగా అఘోరించిందా? సరైన ప్రొసీజర్స్ పాటించకుండానే ఎక్సైజ్ ఎలా నివేదిక ఇచ్చింది? ఎఫ్ఎస్ఎల్ నివేదిక తప్పులతడగా రూపొందించిందెవరు? అంటే కేసును బలహీనపరిచే వ్యూహమా? తెలుగుతారలంతా 'తెర' వెనుక మత్తులో తూగేందుకు కావలసిన సరకు సరఫరా చేస్తున్న, అసలు డాన్‌ను పట్టుకోకుండా ఏమిటీ తెరపై వేషాలు? అరెస్టు.. విచారణ.. తర్వాత తప్పుడు నివేదికలతో నిర్దోషిత్వాలు. ఏమిటీ డ్రగ్గుల డ్రామాలు? ఎవరికోసం? ఇదీ.. ప్రజల ధర్మాగ్రహం.



తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ఊహించిన ట్విస్ట్ చోటు చేసుకుంది. డ్రగ్స్ కేసు వ్యవహారంలో.. పలువురు టాలీవుడ్ ప్రముఖులపై 2017లో నమోదైన కేసులను కోర్టు కొట్టేసింది. అయితే.. టాలీవుడ్ నటులే టార్గెట్‌గా ఎక్సైజ్ కేసులు నమోదవగా.. ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే.. 8 కేసులను సిట్ నమోదు చేసింది. అయితే.. ఈ 8 కేసుల్లో న్యాయస్థానం ఆరు కేసులను కొట్టివేసింది. సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో కొట్టేస్తున్నట్టు కోర్టు పేర్కొంది. డ్రగ్స్ కేసులో పాటించాల్సిన ప్రొసీజర్ ఫాలో కాలేదని ఎక్సైజ్ శాఖపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

అయితే.. ఈ డ్రగ్స్ వ్యవహారంలో పలువురు టాలీవుడ్ ప్రముఖులను అధికారులు నెలల తరబడి వివరించారు. విచారణే కాకుండా.. నటీనటుల దగ్గర నుంచి గోళ్లు, వెంట్రుకల శాంపిళ్లు కూడా తీసుకున్నారు. ఆ శాంపిళ్లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. అయితే.. డైరెక్టర్ పూరీ జగన్నాథ్, హీరో తరుణ్ శాంపిల్స్ మాత్రమే పరిశీలించిన ఎఫ్ఎస్ఎల్.. వాళ్ల శరీరంలో ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు లభించలేదని ఎఫ్ఎఎస్ఎల్ తేల్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఎక్సైజ్ శాఖ తరపున బలమైన సాక్ష్యాలు లేకపోవటంతో ఆరు కేసులను కొట్టేస్తున్నట్టు తీర్పును వెలువరించింది.

2018లో ఎక్సైజ్ శాఖ 8 కేసులను నమోదు చేసింది. ఇందులో ఆరు కేసులను న్యాయస్థానం కొట్టివేసింది. ఎక్సైజ్ శాఖ సరైన ప్రొసిజర్స్ పాటించలేదని అభిప్రాయపడింది. ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారంగా సరైన ఆధారాలు లేకపోవడంతో కేసులు కొట్టివేసినట్లు పేర్కొంది. పలువురి నటుల నుంచి గోళ్లు, వెంట్రుకలను కూడా సేకరించారు. వారి నుంచి తీసుకున్న శాంపిల్స్ ను ఎఫ్ఎస్ఎల్ కు పంపారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన ఈ కేసులో 12 మంది పేర్లు ఉన్నాయి. దర్శకుడు పూరీ జగన్నాథ్, హీరో తరుణ్ తో పాటు పలువురు ఇందులో ఉన్నారు. పూరీ జగన్నాథ్, తరుణ్ నుంచి సేకరించిన శాంపిల్లల్లో ఎలాంటి డ్రగ్స్ అనావాళ్లు లేనట్లు ఎఫ్ఎస్ఎల్ నివేదికల్లో వెల్లడైనట్లు తేలింది. వీటితో పాటు పలు సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆరు కేసులను కొట్టివేసింది. మరో రెండు కేసుల్లో విచారణ జరుగుతోంది.

డ్రగ్స్ కేసులో పాటించాల్సిన ప్రొసీజర్ పాటించలేదని, ఆరు కేసుల్లో ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేవని కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, ఈ కేసులకు సంబంధించి నెలల తరబడి టాలీవుడ్ నటులను ఎక్సైజ్ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వారి మొబైల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. కాగా, డ్రగ్స్ కేసులో ప్రముఖ సినీనటులు రవితేజ, రకుల్ ప్రీత్ సింగ్, తరుణ్, పూరీ జగన్నాథ్, చార్మి, నవదీప్, నందు, ముబైత్ ఖాన్, తదితరులను అధికారులు విచారించిన విషయం తెలిసిందే.



### పరారీలో డైరెక్టర్ క్రిష్

గచ్చిబౌలి రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసు కీలక మలుపు తీసుకుంటోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టర్ క్రిష్ పరారీలో ఉన్నాడని కోర్టుకు తెలిపారు పోలీసులు. క్రిష్ కోసం వెతుకుతున్న పోలీసులు.. అతనిపై 160 సిఆర్‌పిసి సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు కోర్టుకు చెప్పారు. ఈ కేసులో వివేక్ డ్రైవర్ గద్దల ప్రవీణ్, డ్రగ్స్ సప్లయర్ మీర్జా వహిద్ బేగ్‌లను వరుసగా 11, 12 నిందితులుగా చేర్చారు పోలీసులు. వివేక్ ఏడాది క్రితమే డ్రగ్స్‌కు బానిసయ్యాడని పోలీసులు గుర్తించారు.



డైరెక్టర్ క్రిష్, నిర్భయ్ సింధీలతో కలిసి వివేక్ డ్రగ్స్ తీసుకున్నాడని చెప్పారు. ఫిబ్రవరి 24న జరిగిన డ్రగ్స్ పార్టీలో శ్వేత, లిషి, నీల్‌తో పాటు క్రిష్ కూడా ఉన్నాడని పోలీసులు గుర్తించారు.

గచ్చిబౌలి రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసు కీలక మలుపు తీసుకుంటోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టర్ క్రిష్ పరారీలో ఉన్నాడని కోర్టుకు తెలిపారు పోలీసులు. క్రిష్ కోసం వెతుకుతున్న పోలీసులు.. అతనిపై 160 CRPC సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు కోర్టుకు చెప్పారు.

ఈ కేసులో వివేక్ డ్రైవర్ గద్దల ప్రవీణ్, డ్రగ్స్ సప్లయర్ మీర్జా వహిద్ బేగ్‌లను వరుసగా 11, 12 నిందితులుగా చేర్చారు పోలీసులు. వివేక్ ఏడాది క్రితమే డ్రగ్స్‌కు బానిసయ్యాడని పోలీసులు గుర్తించారు. డైరెక్టర్ క్రిష్, నిర్భయ్ సింధీలతో కలిసి వివేక్ డ్రగ్స్ తీసుకున్నాడని చెప్పారు. ఫిబ్రవరి 24న జరిగిన డ్రగ్స్ పార్టీలో శ్వేత, లిషి, నీల్‌తో పాటు క్రిష్ కూడా ఉన్నాడని పోలీసులు గుర్తించారు.

# మరణం తర్వాత ఏం జరుగుతుంది?

ప్రతి మానవునికి ఇది ప్రశ్న మాత్రమే .దీనికి సమాదానంగా. ఒక పండితుడు పురాణాల ననుసరించి చర్చించిన ఒక Post పంపినారు.. భూమితో అనుసంధానింపబడి ఉన్నచక్రాలతో సంబంధం తెగిపోతుంది.భూమితో ఇక సంబంధం తెగిపోయింది అనడానికి సూచనగా, మొదట, మరణానికి సుమారు 4-5 గంటల ముందు భూమితో అనుసంధానింపబడి ఉన్న చక్రాలతో సంబంధం తెగిపోతుంది.

అందువలనే మీరు మరణానికి కొద్ది గంటలలో, చేరువలో ఉన్న వ్యక్తిని యొక్క అరికాలు పాదాలు గమనించారంటే..అవి చల్లబడుతున్నాయి అని తెలుసుకుంటారు.

### సూక్ష వెండి తీగ

అసలు ఏం జరుగుతుందంటే, ఆత్మకి అనుసంధానింపబడి ఉన్న వెండితీగ తెగిపోతుంది. ఎప్పుడైతే ఈ వెండితీగ తెగుతుందో, శరీరంలో అంతవరకు ఉన్న ఆత్మకి స్వేచ్ఛ లభించి శరీరం నుండి బయటకి వచ్చేస్తుంది. కానీ ఇంతకాలం ప్రేమించిన శరీరాన్ని వదిలి వెళ్లలేక, మళ్ళీ మళ్ళీ శరీరంలోకి ప్రవేశించి శరీర అంగాలను కదిలించడానికి ప్రయత్నిస్తుంది.
ఒకవేళ మరణించిన వ్యక్తిని, మరణించిన వెంటనే సూక్షమంగా పరిశీలిస్తే, ముఖంలోనో లేక శరీర ఇతర అవయవలాలలోనో సూక్షమైన కదలికలు గమనించగలగుతారు. అలా ఎందుకు జరుగుతుందంటే, ఆత్మ తన శరీరాన్ని కదలించడానికి ప్రయత్నించడం వల్లనే.

మరణించిన కాసేపటికి శరీరం నూతనంగానే ఉంటుంది అయినా కూడా, వెండి తీగ తెగిపోవడం వలన, శరీరంలో దూరగలిగినా అక్కడ ఉండలేక పోవడం వలన, ఆత్మ ఇక శరీరం నుండి బయటకి వచ్చేస్తుంది. ఏదో ఒక శక్తి వలన ఆత్మ, అలా శరీరం నుండి పైకి, ఇంకా పైకి ఆకర్షింపబడుతుంది.

### భౌతికశరీరానికి ముగింపు

శరీరంలో ఉన్నప్పటిలాగే ఆత్మా తన ప్రియమైన వాళ్లతో మాట్లాడుతుంది, నేను మరణించలేదు అని చెబుతుంది. కానీ, ఆత్మ మాట్లాడిన మాటలు వారికి వినబడవు. నెమ్మదిగా ఆత్మకి అర్థమవడం మొదలవుతుంది తాను ఇక తన శరీరంలో జేరలేనని. శరీరానికి సుమారు 12 అడుగుల ఎత్తులో ఆత్మ ఉండి, ఆ గదిలో జరుగుతున్న అన్ని విషయాలు వినడము మరియు చూడడము జరుగుతుంది. సాధారణంగా అంత్య క్రియలు జరిగేంతవరకూ ఆత్మ అలా సుమారు 12 అడుగులు శరీరానికి పైన వుంటుంది. మీరు ఇప్పుడు అర్థం చేసుకోండి.

ఇకపై ఎక్కడైనా అంత్యక్రియలు కార్యక్రమం జరుగుతోంది అంటే, అక్కడ ఆ శరీరానికి సంబంధించిన ఆత్మ ఉండి, అక్కడ జరుగుతున్న అన్ని విషయాలు చూస్తూ, వింటూ ఒక సాక్షిభూతంగా వుందని.

### భౌతికదేహంతో విడివడుట

ఇక అంత్యక్రియలు కూడా జరిగాక, తన దేహానికి అంత్యక్రియలు చూసుకున్నాక, ఆత్మకి ఇక భూమిపై తన జీవనం లేదని మరియు పార్థీవ దేహం పంచభూతాలలో కలసిపోయిందని నిర్ణయించుకుంటుంది. అప్పటిదాకా తను దేహంలో ఉండడం వలన ఉన్న బంధాలన్నీ పూర్తిగా విడివడిపోవడం వలన, ఇక ఆత్మకి పూర్తి స్వేచ్ఛ అనుభవంలోకి వస్తుంది. ఆత్మ తలచుకున్న మాత్రానా ఎక్కడికైనా పోగల శక్తి వస్తుంది. తర్వాతి 7 రోజులు తాను దేహంలో ఉండగా తిరిగిన ప్రదేశాలు, తనకిష్టమైన అన్ని ప్రదే శాలను తిరిగి చూసుకుంటూ ఉంటుంది. 7 రోజులు ముగిసాకా, తన కుటుంబానికి, ప్రియమైన వారికి వీడుకోలు చెప్పుకొని, భూమిని దాటి గగనంలోకి వెళ్ళిపోతుంది.

### ఆత్మప్రయాణం

ఆత్మలలోకానికి వెళ్ళడానికి ముందు ఒక పెద్ద మార్గం గుండా ఆత్మ ప్రయాణం చేయవలసి వుంటుంది. అందువలన తర్వాతి 12 రోజులు అత్యంత ముఖ్యమైనవి. ఈ 12 రోజులలో మనం జరుపవలసిన కార్యక్రమాలు చక్కగ నెరవేర్చవలసి వుంటుంది.
మనం చేసిన తప్పులను క్షమించమని ఆత్మని అడగడము మరియు ప్రార్థించడము జరుపవలెను. అంత్యక్రియల తరువాత జరుపబడే కార్యక్రమాలు, ప్రార్థనలు, ఆత్మకి తన ప్రయాణంలో ఒక ఆహారంలాగా సహకరిస్తాయి. ఆత్మలలోకానికి అడుగుపెడు తున్నాను అన్న సూచనగా, మార్గం యొక్క ముగింపులో ఆత్మకి ఒక అతి పెద్ద వెలుగు కనపడుతుంది.

### పూర్వీకులను కలసుకొనుట

హిందువులు 11వ మరియు 12వ రోజున జరుపబడే ఇతర కార్యక్రమాలవలన, ఆత్మ తన పూర్వీకులను, ఆప్త మిత్రులను, బంధువులను మరియు తనకు మార్గనిర్దేశనం చేసిన వారిని కలసుకోవడం జరుగుతుంది మనం భౌతికంగా ఎలాగైతే, మన దూరపుబంధువులు మన ఇంటికి వచ్చినప్పుడు ఆనందంగా



కౌగిలించుకుంటామో, అదేవిధంగా ఆత్మలలోకంలో కూడా 12వ రోజున మరణించిన పూర్వీకులు ఆ ఆత్మని అహ్వానించి మనస్ఫూర్తిగా కౌగిలించుకుంటారు.
ఆ తర్వాత ఆత్మ యొక్క మార్గనిర్దేశకులు, ఆత్మని తను భూలోకంలో, భాద్యతవహించిన సంఘటనలను సమీక్షించుకోవడానికి, ఒక పెద్ద వెలుగువంటి బోర్డ్ ఉన్న ప్రదేశానికి తీసుకునివెళ్తారు. దీనినే కార్మిక్ బోర్డ్ అంటారు. ఈ బోర్డ్‌లో గత జన్మలో జరిగినదంతా చూపించబడుతుంది.

### జీవితాన్ని పరిశీలించుకొనుట

ఇచ్చుట అంక్షపెట్టే వారు, నిర్ణయించేవారు ఎవరూ ఉండరు. ఎలాగైతే ఆత్మ భూమిపైన తన జన్మలో ఇతరులని నిర్ణయించిందో అంటే జడ్జ్ చేసిందో అలాగ ఇక్కడ తనని తానే జడ్జ్ చేసుకుంటుంది. భూమిపై ఎవరికైతే కష్టాలను కలిగించిందో అవన్నీ చూసుకొని తాను తప్పుచేసానని ఫీల్ అవుతుంది.
తాను చేసిన తప్పుల నుండి జ్ఞానం పొందటానికి శిక్ష కావాలని కోరుకుంటుంది. ఈ విధమైన తన గత జీవితాన్ని పరిశీలించుకోవడం ద్వారా, రాబోయే తన జీవితానికి ఒక బ్లూప్రింట్ అంటే నఖలు లేదా ఒక ప్లాను వేసుకుంటుంది. ఏలాంటి సంఘటనలని ఎదుర్కొనాలి. ఎలాంటి ఛాలంజ్ లను ఎదుర్కొనాలి. ఎలాంటి కష్టాలను అధిగమించాలి. ఇలాంటి ఎన్నో నిర్ణయాత్మక రచనలతో నఖలు తయారుచేసుకుంటుంది. ఇంకా చెప్పాలంటే, నిమిషాలతో సహా, వయస్సు, వ్యక్తులు, పరిసరాలు, సంభవాలు లేక సంఘటనలు అన్నీ, తాను ఎదుర్కొన వలసినవి రచించుకుంటుంది.

### నఖలు లేదా నమూనా

ఈ విధంగా మన తప్పిదాలకి మనమే బాధపడతాము మరియు శిక్షలు విధించుకుంటాము. ఒక ముఖ్యవిషయం చెప్పాలి అదే ఏమిటంటే, మీరు ఒక తప్పు చేసే దానికి 10 రెట్లు లేదా 20 రెట్లు అధికంగా భాదపడవలసి వస్తుంది అంటారు. అది నిజం కాదు. కానీ ఆత్మా తన గత జన్మ పరిశీలన చేసుకున్నాక ఎంత ఎక్కు వగా బాధపడుతుందో అంత ఎక్కువగా శిక్షని విధించు కుంటుంది. ఒకోసారి 5 నెలలు ఒక వ్యక్తి తాను బాధపెట్టి వుంటే 2 సంవత్సరాలు తన రాబోయే జన్మలో బాధపడాలి అని కూడా నిర్ణయంతీసుకుంటుంది. అందువలనే, మీ భావోద్వే గాలని సరిచేసుకుంటూ ఉండాలి అని అంటూ వుంటారు ఎందుకంటే, అవే తర్వాత కూడా మోసుకునిపోబడతాయి కాబట్టి. ఒక సారి ఈ నమూనా పూర్తిగా తయారుచేసుకున్నాక ఒక ప్రశాంతతో కూడిన కాలం ఆత్మకి అప్పుడు ప్రారంభ మవుతుంది.

### మరుజన్మ

మన మరుజన్మ ఆత్మలలోకంలో తయారు చేసుకున్న నఖలు పై ఆధారపడి ఉంటుంది. జన్మకి మరుజన్మకి మధ్య 20 నుంచి 30 ఏళ్ళు పట్టవచ్చు లేదా ఇంకా ఎక్కువ కాలం కూడా పట్టవచ్చు. మన తల్లిదండ్రులను మనమే నిర్ణయించుకుంటాము ఒకోసారి తల్లిగర్భంలో పిండం రూపుదిద్దుకుంటున్న సమయంలోనో లేక గర్భం దాల్చిన 4, 5 నెలకో, లేక పుట్టడానికి కొంత సమయం ముందో ఆత్మ ప్రవేశించడం జరుగుతుంది. ఈ సృష్టి ఎంత అద్భుతమైనదంటే పుట్టే తేదీ, సమయము మరియు స్థలమునకు తగినట్టు గ్రహముల అమర్చబడినాయి. చాలామంది అనుకుంటూ ఉంటారు, నేను దురదృష్ట జాతకుడను, నాకు అదృష్టం లేదని కానీ అసలు విషయం ఏమిటంటే, నీ జీవితం మొత్తం కూడా, నువ్వు ఆత్మలలోకంలో తయారుచేసుకున్న నఖలు లేదా బ్లూప్రింట్ మాత్రమే.
ఒకసారి మరుజన్మ తీసుకున్నాక, 40 రోజులదాకా బిడ్డ తన గత జన్మకి సంబందించిన జ్ఞాపకాలు అన్నీ కలిగివుంటుంది. అందువలనే ఒకోసారి సంబంధం లేకుండా నవ్వడమూ లేక ఏడ్వడమూ జరుగుతూ ఉంటుంది. 40 రోజుల తర్వాత, గత జన్మకి సంబందించిన అన్ని జ్ఞాపకాలు ఆటోమెటీక్ గా తుడిచివేయబడి, అసలు నాకు గతజన్మ అంటూ ఒకటి ఉందా అన్నంతగా మారిపోతాము.

### నఖలు అమలుపరచబడుట

ఇక అప్పటినుండి నఖలులో లిఖించుకున్నది పూర్తిగా అమలు లోకి రావడం ప్రారంభమవుతుంది. ఇక అప్పటి నుండి, మన సంఘటనలు తలచుకుని, ఇతరులను మరియు భగవంతుని దూషించడము ప్రారంభమవుతుంది. అందువలన మీరు ఇంకొకరిని వ్రేలెత్తి చూపే ముందర గుర్తుంచుకోండి, ఇతరులందరూ మీ నఖలులో మీరు పూర్తిగా మీ స్వంత ఇష్టంతో లిఖించుకున్న ప్రకారమే మీకు సహాయం చేస్తున్నారని. మనము ఏదైతే ముందరే జరగాలని నిర్ణయించుకున్నామో అదే జరుగుతోంది. తలిదండ్రులు, బంధువులు, మిత్రులు, శత్రువులు, భాగస్వామీ అందరూ కూడా మన జీవితంలోకి ఎందుకు వస్తున్నారంటే, వారు అలా రావాలని మీరే నిర్ణయించుకున్నారు కాబట్టి.మరణించిన తర్వాత ఆత్మలు భూమిపైనే తిరుగుతూ ఉండడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి వాటిలో కొన్ని, చేయవలసిన పని మధ్యలో ఆగిపోవడం, అత్యంత దుఃఖం, గాయాల వలన మరణించడం, అనుకోని సమయంలో అంటే ఉన్నపలంగా మరణం సంభవించడము.
ఏది ఏమైనప్పటికి ఆత్మకి 12 రోజుల గడువు మాత్రమే ఉంది, ఈ గడువులోపే తను చేయాలనుకున్నవన్నీ చేయగలగాలి. 12 రోజుల తర్వాత కొంతకాలం ఆగి, ఆత్మల లోకాల ద్వారం కూడా మూసివేయబడుతుంది. అలా జరిగితే, ఆత్మల పరిస్థితి మరీ దయానీయకమై పోతుంది. ఎందువలన అంటే, అవి ఆత్మలలోకానికీ వెళ్లలేవు. భూలోకంలో శరీరంతో వ్యవహరించ డానికి మళ్ళీ జన్మ తీసుకోలేవు. అందువలననే మన ప్రార్థనలు మరియు మరణించినవారికి జరుపబడే కార్యక్రమాలు అతి ముఖ్యమైనవి. అలా చేయడం వలన, ఆత్మలు తమ ప్రయాణాన్ని ప్రశాంతంగా సాగించి ఆత్మలలోకానికి వెళ్ళి చేరుతాయి. హిందూ సాంప్రదాయంలో ఆ 12 రోజులు దేవాలయానికి వెళ్ళడం నిషిద్ధం అని వుంది. మనము మరణించిన వారిని కాపాడుటకు వారు తమ గమ్యాన్ని చేరుటకు, మన వంతు సహాయం చేయడం కూడా ఎంతో ప్రాధాన్యమైనదే. మనకి మరణం లేదు, మరణం అనేది అంతం కాదు. అది ఒక విడిది సమయం మాత్రమే మళ్ళీమనం కలుసుకోవడానికి.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144